7-1-99





బాలగోపాల్

# చదువుగురించి మాట్లాడటమూ కుట్ర అవుతుందా?

అమర్త్యసేన్‌కు నోబెల్‌బహుమతి ఇచ్చినప్పుడు విశ్వహిందూపరిషత్ వ్యతిరేకించడం మొదట్లో ఎవరికీ అంతుబట్టలేదు. సేన్ బాబ్రీ మసీదు కూల్చివేతను వ్యతిరేకించిన మాట వాస్తవమే. బహిరంగంగానే వ్యతిరేకించారు. భారతదేశ సంస్కృతిలోని బహుళత్వం ఒక గొప్ప లక్షణమనీ, దానిని ధ్వంసం చేయడాన్ని చూస్తూ సహించరాదనీ అన్నారు. బహుశా అందువల్లనే ఆయనకు నోబెల్ పురస్కారం లభించడం విశ్వహిందూపరిషత్‌కు కడుపుమంట కలిగించి ఉండవచ్చునని అప్పట్లో అనుకున్నాం. అంతకంటె లోతయిన కారణమేదైనా ఉండగలదని అనుకోలేదు.

కానీ ఈ మధ్య అశోక్‌సింఘాల్ సేన్‌కు నోబెల్ బహుమతి ఇవ్వడాన్ని క్రైస్తవుల కుట్రగా అభివర్ణించేసరికి మరొకసారి విస్మయం కలిగింది. ముస్లింలమీద దాడులను వ్యతిరేకించాడని వీరికి అతనిపై కోపం ఉందిలెమ్మనుకుంటుంటే మధ్యలో ఈ క్రైస్తవుల కుట్ర ఏమిటి? సేన్ క్రైస్తవుడు కాదు. మతం ప్రస్తావన వచ్చినప్పుడు తాను బుద్ధుడినీ, బౌద్ధాన్నీ అభిమానిస్తానని చెప్పుకున్నాడే తప్ప క్రైస్తవాన్ని కాదు. ఆయన భార్య క్రైస్తవ స్త్రీ అనా వీరి ఉద్దేశం? కానీ పేరునుబట్టి ఆమె యూదు మతానికి చెందిన స్త్రీ అయి ఉండాలి, క్రైస్తవం కాదు.

మొత్తానికి అశోక్‌సింఘాల్ ఆంతర్యమేమిటో అంతుబట్టలేదు. మధ్యయుగాల అవశేషాలుగా మిగిలిపోయిన వారి ఆలోచనలు మనకు అర్థంకావు లెమ్మని సర్దిచెప్పుకున్నాం. అదే పొరపాటు. సంఘ్‌పరివార్ ఆలోచనలు అవశేషాలు కావు. ఎంత ప్రాచీనమైనవో అంత ఆధునికమైనవి.

మాబోటి తెలివితక్కువవాళ్ళ కోసం అశోక్ సింఘాల్ ఆలోచనలను ఈ మధ్యనే ఆచార్య గిరిరాజ్‌కిశోర్ విడమరచి చెప్పాడు. సేన్ ప్రాథమికవిద్య గురించి పదేపదే మాట్లాడుతున్నాడు. విద్యావ్యాప్తికి ప్రభుత్వ విధానాలలో కేంద్రస్థానం ఉండాలంటున్నాడు. ఇది క్రైస్తవ మిషనరీలకు ఉపయోగపడే ఆలోచన కాబట్టే అతనికి నోబెల్ ప్రైజ్ ఇవ్వడం జరిగిందనీ, అందుకే దానిని క్రైస్తవకుట్రగా సింఘాల్ అభివర్ణించాడనీ, అతనిని ఎవరూ అర్థం చేసుకోలేకపోయారనీ గిరిరాజ్‌కిశోర్ వాపోయారు. పైగా, తనకు వచ్చిన నోబెల్ బహుమతిని మొత్తం ప్రాథమికవిద్యావ్యాప్తికోసం వెచ్చిస్తాననికూడా అమర్త్యసేన్ అన్నాడట. ఆ డబ్బుతో క్రైస్తవమిషనరీలు మరింత పెట్రేగిపోతాయని గిరిరాజ్ కిశోర్ హెచ్చరించాడు. విషయాన్ని ఇంత స్పష్టంగా విడమరచి చెప్పినందుకు ఆచార్యులవారికి ధన్యవాదాలు.

అమర్త్యసేన్ విద్యమీద ఖర్చుపెడతానని ప్రకటించిన మొత్తాన్ని క్రైస్తవ మిషనరీలే వాడుకుంటారని ఎందుకు భావించాలి, ఏ హైందవ సంస్థో వాడుకోవచ్చు గదా అని వారిని అడగనవసరం లేదు. మనకు స్వతహాగా అటువంటి ఆలోచనలు రావని వారికి తెలుసు. అందరికీ చదువు చెప్పేస్తే ప్రతీ ఎల్లిగాడూ ఎల్లక్కా పొగరుతో బలిసిపోయి నువ్వెంతో నేనూ అంతేనంటే కష్టం కాదూ? సేన్‌కు ఇచ్చిన నోబెల్ బహుమతితో పాటు మదర్ థెరిసాకు ఇచ్చిన పురస్కారాన్ని కూడా సింఘాల్‌గారు, గిరిరాజ్ కిశోర్‌గారు క్రైస్తవకుట్రగా అభివర్ణించారు. మరి హైందవంలోనూ సన్యాసులకేం కొదవలేదు. వాళ్ళు తమ పొట్టకూటి గురించి, కొసరుగా మోక్షం గురించి ఆలోచిస్తారే తప్ప మదర్ థెరిసాలెందుకు కాలేకపోయారన్న ప్రశ్న వీరు వేసుకోరు.

అమర్త్యసేన్ గురించి సింఘాల్, గిరిరాజ్ కిశోర్‌లు చేసిన వ్యాఖ్యలు గుజరాత్‌లో క్రైస్తవ సంస్థలమీద దాడులు జరుగుతున్న నేపథ్యంలో ప్రచారంకావడం కాకతాళీయమే కావచ్చును గానీ రెండిటిమధ్య ఉన్న సంబంధాన్ని చూడడం అవసరం. విద్యావ్యాప్తి పేరిట క్రైస్తవులు మతమార్పిడి చేస్తున్నారనేది క్రైస్తవసంస్థలమీద హిందుత్వ ఉన్మాదుల అభియోగం. అమర్త్యసేన్ విద్యకు ఇచ్చే ప్రాముఖ్యంవల్ల క్రైస్తవ మిషనరీల వ్యాప్తికి అతని ఆలోచనలు తోడ్పడతాయని అతనిపైన వీరి అభియోగం.

మరి వీరి నిజమైన అభియోగం మతమార్పిడులు చేస్తున్నారనా లేక బడుగుజనానికి విద్య అందిస్తున్నారనా?

ప్రభుత్వం ఏ రకమైన ఆర్థికవిధానరచన చేసినప్పటికీ, దానివల్ల ప్రయోజనం పొందడానికీ, దానిలో పాల్గొనడానికీ కావలసిన బలం పేదప్రజలకు ముందు కల్పించాలనీ, లేకపోతే ఆ విధానరచన విఫలంకావడమేకాక పేదలు, ధనికుల మధ్య తేడాలు పెరిగిపోతాయనీ, దోపిడీ పీడనలు పెరిగిపోతాయనీ, హింస పెరిగిపోతుందనీ అమర్త్యసేన్ హెచ్చరిస్తాడు. పేదలకు 'బలం' చేకూర్చే విషయాలలో విద్య, వైద్యం, సాంఘిక సమానత్వం, భౌతిక వనరులు, ఆర్థికస్వేచ్ఛ, రాజకీయ ప్రజాస్వామ్యం మొదలయిన వాటిని ఆయన ప్రధానంగా లెక్కిస్తాడు. మామూలు రాజకీయపరిభాషలో అమర్త్యసేన్ 'లెఫ్టిస్టు' కాడు, 'రైటిస్టు' కాడు. అంటే ప్రభుత్వరంగ ప్రాధాన్యతా లేక ప్రైవేట్‌రంగ ప్రాధాన్యతా అనేది ఆయన దృష్టిలో ముఖ్యమైన ప్రశ్న కాదు. ఈ ప్రశ్నలు అక్కరలేదంటాడని కాదు కానీ అంతకంటే ముఖ్యంగా, విధానరచన ఏ రూపం తీసుకున్నప్పటికీ అందులో పాల్గొని ప్రయోజనం పొందడానికి కావలసిన 'బలం' ప్రజలకు కల్పిస్తున్నారా లేదా అనేది చూడాలంటాడు. దాని గురించి భారతదేశంలోని వామపక్షాలు సహితం ఎక్కువ ఆందోళన చేయడంలేదనీ, ఆర్‌టిసినీ, విద్యుత్‌బోర్డునూ ప్రైవేట్‌పరం చేయడం తగునా లేదా మొదలయిన వివాదాలే ప్రధానం అయిపోయాయనీ ఆందోళన వ్యక్తంచేస్తాడు. ప్రజలకు శక్తిసంపదలు కల్పించే విధానాలు ముందు ఉంటే ఆ ప్రాతిపదికన మిగిలిన ప్రశ్నలకు నిర్దిష్టంగా జవాబు చెప్పుకోవచ్చునంటాడు.

ప్రజలకు 'బలం' కల్పించే విషయాలుగా ఆయన అయిదారు అంశాలను గుర్తిస్తాడు కానీ వాటిలో ఆయన ఎక్కువ నొక్కిచెప్పేది విద్యా వైద్య హక్కులు. కనీసమైన చదువు, ఆరోగ్యం లేని ప్రజలతో దేశాన్ని సరళీకరణ వైపు నెట్టడం అసమానతనూ, హింసనూ పెంచుతుందని హెచ్చరిస్తాడు.

హిందూత్వవాదులు ఇక్కడే 'ప్రమాదాన్ని' పసిగట్టినట్టున్నారు. సరిగ్గా ఈ రెండు రంగాలలోనే క్రైస్తవసంస్థలు భారతదేశంలో విశేషమైన కృషి చేసి ఉన్నాయి. స్వాతంత్ర్యం తరువాత విద్యా వైద్య రంగాలలోకి ప్రభుత్వం పెద్దఎత్తున ప్రవేశించకముందు ఈ రంగాలలో ఎక్కువ సేవలు అందించింది క్రైస్తవసంస్థలే. ఇదంతా మతమార్పిడి కోసమేనని దబాయించి ఎవరినీ ఒప్పించలేరు. మిషన్ స్కూళ్ళు, మిషన్ ఆస్పత్రులూ అందిచ్చిన సేవలకూ, వారు సాధించిన మతమార్పిడికీ పొంతనే లేదు. 1950ల దాకా ఈ దేశంలోని మధ్యతరగతి (అన్ని మతాల వారు) ఎక్కువభాగం మిషన్‌స్కూళ్ళలోనే చదువుకున్నారు. మధ్యతరగతే కాక పేదలు కూడా మిషన్‌ఆస్పత్రుల సేవలు పొందారు. కానీ మతమార్పిడి జరిగింది కొంచమే. ఈనాటికీ భారతదేశంలో క్రైస్తవుల జనాభా 2.3 శాతం మాత్రమే ఉంది. ఇదికూడా విద్యా వైద్య సేవలను 'ప్రలోభంగా' చూపించి సాధించినది కాదు. అదే నిజమైతే ఈ దేశంలోని అన్ని కులాలవారూ మతం మార్చుకుని ఉండాలి. కానీ మారింది అత్యధికభాగం హైందవ సమాజంలో గౌరవం, గుర్తింపు లేని దళితులూ, ఆదివాసీలే. దానిని 'ప్రలోభం' అనలేము. హేతుబద్ధమైన నిర్ణయం అని గుర్తించక తప్పదు. మతస్వేచ్ఛను ప్రాథమిక హక్కుగా గుర్తించిన రాజ్యాంగం దళితులకు ఆ అవకాశం ఇచ్చింది, హైందవసమాజం ఆ అవసరం కల్పించింది.

అయినా, అమర్త్యసేన్‌కు నోబెల్ బహుమతి వచ్చింది అనగానే ఆయన విద్యా వైద్య హక్కుల గురించి మాట్లాడతాడని గుర్తుతెచ్చుకొని, క్రైస్తవసంస్థలు ఆ రంగాలలోనే కృషిచేసి ప్రజల ఆదరణ పొందాయని జ్ఞాపకం తెచ్చుకుని, ఇన్ని శతాబ్దాల తర్వాత కూడా 2.3 శాతం దాటని మతమార్పిడుల పేరు చెప్పి ఆందోళన చెందుతున్నట్టు ప్రకటిస్తున్న ఈ విశ్వహిందూపరిషత్ నాయకుల ఆలోచనలు పుచ్చిపోయాయని ఛీత్కరించుకోవాలా? లేకపోతే వాళ్ళ నిజమైన అభ్యంతరం అప్పుడప్పుడు జరిగే మతమార్పిడుల గురించి కాదనీ, విద్య, ఆరోగ్యం, సాంఘిక సమానత్వం దళితులకూ ఆదివాసీలకు కల్పించే ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసాల గురించి అని అర్థం చేసుకోవాలా? అసలు ఎవరైనా విద్య గురించి, ఆరోగ్యం గురించి మాట్లాడితే సంతోషించాలా లేక ఏవో కుట్రలు ఊహించుకుని అభ్యంతరం తెలపాలా? అభ్యంతరం తెలిపే వారి మానసికస్థితి గురించి ఏమనుకోవాలి?

సమాజంలో ఒకరిద్దరి ఆలోచనలు పుచ్చిపోయినా మనసులు కుళ్ళిపోయినా బాధపడి ఊరుకోవచ్చు. కానీ వీళ్ళే రోజు మన సమాజాన్ని ఏలుతున్నారు. ఒక పక్క పార్లమెంటరీ ప్రజాస్వామ్య పరిభాష మాట్లాడే భారతీయజనతా పార్టీ, మధ్యలో సంస్కృతి గురించి ఆధ్యాత్మికత గురించి ఉపన్యాసాలు ఇచ్చే వారు, ఇటు చివర కర్రలతో, రాళ్ళతో గూండాగిరీ చేసే దళ్‌లూ సేనలూ మంచ్‌లూ —ఈ పరివారం చాలా పెద్దదే. ఒకరినడిగితే మాకేమీ తెలీదంటూ వేరే వాళ్ళు చేసే హింసాకాండకు జవాబు చెప్పకుండా తప్పించుకుంటారు. కానీ అది 'హిందువుల న్యాయమైన ఆగ్రహం' అనో మరొకటనో వెనువెంటనే సమర్థిస్తారు. గుజరాత్‌లో క్రైస్తవసంస్థలమీద జరుగుతున్న దాడుల విషయంలో ఇదే జరుగుతున్నదని అందరం చూస్తున్నాం.

ప్రస్తుతానికి అందరం నిస్సహాయంగా చూస్తున్నాం. మనం చూసేకొద్దీ ఈ పరివారం దేశంలోని అతిపెద్ద టెర్రరిస్టుబృందంగా తయారవుతున్నది. మిగిలిన టెర్రరిస్టుబృందాలు రహస్యంగా పనిచేస్తాయి. పోలీసు దాడులకూ, సైన్యం దాడులకూ గురవుతాయి. వారి పద్ధతుల మంచిచెడులు ఎలా ఉన్నా వారిలో కొందరి లక్ష్యాలలో ఆమోదనీయమైన అంశాలున్నాయి. ఈ సంఘ్ పరివార్ టెర్రరిస్టులు బహిరంగంగా పనిచేసే టెర్రరిస్టులు. 'చట్టబద్ధంగా' అధికారం చేపట్టిన టెర్రరిస్టులు. పోలీసులూ, సైన్యమూ వీరి అదుపులో ఉన్నాయి. వీరి లక్ష్యాలలో ఆమోదనీయమైనది ఏ కోశానా లేదు.

ఈ టెర్రరిజాన్ని ఎన్నాళ్ళు సహిద్దాం?

